మన బలగం
సామాన్యుడి ఆయుధం
తెలుగు దినపత్రిక
24-03-2025 సోమవారం పేజీలు 4 www.manabalagam.com



# ఏప్రిల్ నుంచి సన్న బియ్యం

- తెల్లరేషన్ కార్డు దారులకు పంపిణీ
- ఉత్తమ్ కుమార్ రెడ్డి
- కృష్ణా జలాల విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వైఫల్యం
- నల్లగొండ అభివృద్ధిపై బీఆర్ఎస్ వైఫల్యం
- కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**సూర్యాపేట, మార్చి 23:** సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం జాన్ పహాడ్ వద్ద మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణలో సన్న బియ్యం పంపిణీ, నల్లగొండ జిల్లాకు సంబంధించిన అభివృద్ధి ప్రణాళికలు, కాంగ్రెస్ భవిష్యత్ లక్ష్యాల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరిగేషన్, సివిల్ సప్లై శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, 'తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఏప్రిల్ నెల నుండి సన్న బియ్యం అందుబాటులోకి వస్తుంది. ముఖ్యంగా హుజూర్ నగర్ నుండే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరాం.' అని తెలిపారు.

మిగతా 3 లో

# బార్లపై మామూళ్ల వార్!

**మామూళ్ల జాబితాలో కొత్తగా చేరిన బార్లు ఫుడ్ ఇన్ స్పెక్టర్ ఆఫీస్ ఆదేశాలంట**



..2 లో



# కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం

## బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి

- 27న కరీంనగర్ వేదికగా రజతోత్సవ సభ
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**కరీంనగర్, మార్చి 23 :** తెలంగాణలో గత 14 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో ఉచిత పథకాల పేరుతో ప్రజలను మోసగించి, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను అమలు చేయకుండా వెనక్కు తగ్గిందని ఆయన ఆరోపించారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ ప్రజలకు ఇచ్చిన హామీలను తిలోదకాలు ఇచ్చిందని మండిపడ్డారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడానికి వ్యూహాత్మకంగా ముందుకు సాగుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు. అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు నిర్వహించాలని ఆయన నిర్ణయించారు. ఇప్పటికే సూర్యాపేటలో భారీ బహిరంగ సభను నిర్వహించిన కేటీఆర్, మార్చి 23న కరీంనగర్ పర్యటనకు సిద్ధమయ్యారు. టీఆర్ఎస్ పార్టీ (ప్రస్తుత బీఆర్ఎస్) స్థాపనకు 25 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా, ఈ నెల 27న కరీంనగర్ వేదికగా రజతోత్సవ సభను నిర్వహించాలని పార్టీ నిర్ణయించింది. ఈ సభను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు ఇప్పటికే కసరత్తు ప్రారంభించాయి. ఆదివారం బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఇతర కీలక నేతలు కరీంనగర్ చేరుకున్నారు.

మిగతా 2 లో

# అవినీతి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**ఎన్ హెచ్ఆర్ సి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ భద్రయ్య**



..3 లో

MANA BALAGAM
మన బలగం
సామాన్యుడి ఆయుధం
తెలుగు దినపత్రిక

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి మేస్త్రీలు సిద్ధం



నిర్మల్, మార్చి 23 (మన బలగం): హౌసింగ్ డిపార్ట్‌మెంట్, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ మోడల్ ఇండ్ల నిర్మాణానికి నిర్మల్ జిల్లాలోని వివిధ మండలాలు, పట్టణాల నుంచి ఎంపిక చేసిన తాపీ మేస్త్రీల ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం ఆదివారం నిర్మల్‌లోని ఎన్టీఆర్ స్టేడియం బిల్డింగ్‌లో ముగిసింది. మేస్త్రీలతో కలిసి ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణానికి సంబంధించిన ముగ్గులను, మోడల్ హౌస్ నిర్మాణానికి సంబంధించి నేర్చుకున్న మెలకువలను హౌసింగ్ పీడీ కె.రాజేశ్వర్ అడిగి తెలుసుకున్నారు. శిక్షణ పొందిన మేస్త్రీలు ఈ శిక్షణ తమకు ఇళ్ల నిర్మాణం చేపట్టే క్రమంలో ఎంతగానో దోహదపడుతుందని తమకు తెలువని అనేక విషయాలను ఇక్కడ నేర్చుకున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పీడీ కే.రాజేశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు ఐదు లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతుందన్నారు. ఇప్పటికే గ్రామాల్లో ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తున్నామన్నారు. జిల్లాలో సరైన నివాసం లేనటువంటి అర్హులైన నిరుపేద ప్రజలకు ఇంటిని నిర్మించి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని తక్కువ ఖర్చుతో నాణ్యతా ప్రమాణాలతో నిర్మించి ఇవ్వడానికి మేస్త్రీల ప్రాముఖ్యత చాలా ముఖ్యమని నైపుణ్యం తెలిపారు. మేస్త్రీల కొరత ఉందని, ఈ శిక్షణ ఇండ్ల నిర్మాణం కోసం ఎంతగానో ఉపయోగపడుతుందని సూచించారు. న్యాక్ శిక్షకులు ఎం.మహేష్ కుమార్ శిక్షణ పొందిన మేస్త్రీలు పాల్గొన్నారు.

## అంజన్న జయంతి ఉత్సవాలపై సమీక్షా సమావేశం



మల్యాల, మార్చి 23 (మన బలగం): మల్యాల మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం కలెక్టర్ అధ్యక్షతన సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా క్యూ లైన్లు, ప్రత్యేక దర్శనం క్యూ లైన్లు, స్నానపు గదులు, సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జయంతి జరిగే 3 రోజుల పాటు మండల అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఈఓ శ్రీకాంత రావు, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, డీఎస్పీ, ఆర్‌డి.వో, డిపీవో, మల్యాల ఎమ్మార్వో మునిందర, ఎంపిడివో స్వాతి, సర్కిల్ ఇన్స్పెక్టర్ రవి, ఎస్సై నరేష్ కుమార్, సందీప్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక పారదర్శకంగా జరగాలి

సిద్దిపేట, మార్చి23 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఐఓసీ కార్యాలయంలో హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ జిల్లాల అదనపు కలెక్టర్లు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. వేసవి కాలం సమీపిస్తున్నందున గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా నిర్వహించి, పేదలకు ప్రాధాన్యత ఇవ్వాలని, వరి కోతలు కొనసాగుతున్న నేపథ్యంలో, కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలన్నారు. రేషన్ కార్డుల పంపిణీ త్వరలో జరగనుంది. ఉగాది నుంచి నల్గొండ జిల్లాలో సన్న బియ్యం పంపిణీ ప్రారంభమవుతుందని, ప్రజలు సమస్యలు ఎదుర్కొన్నా, అధికారులు వాటిని పరిష్కరించకుండా, మంత్రివర్గ దృష్టికి తేవకుండా ఉంటే, ఆందోళనలకు కారణం అధికారులే అవుతారని మంత్రి హెచ్చరించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం

మొదటి పేజీ తరువాయి

కరీంనగర్‌లో పార్టీ కార్యకర్తలు కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన కాన్వాయ్‌లోని వాహనాల కదలికలో ఒక చిన్న ప్రమాదం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ కార్యకర్త శ్రీకాంత్ బైక్, విధుల్లో ఉన్న మహిళా కానిస్టేబుల్ పద్మజను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె కాలు విరగడంతో వెంటనే ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స అందించారు. ఈ ఘటనకు సంబంధించి కేటీఆర్ స్పందించి, బాధిత కానిస్టేబుల్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆమెకు తగిన చికిత్స అందించాలని ఆసుపత్రి అధికారులను ఆదేశించారు. ఈ సంఘటన తర్వాత కూడా కేటీఆర్ తన షెడ్యూల్ ప్రకారం పార్టీ కార్యకలాపాలను కొనసాగిస్తూ, రాబోయే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు నేతలతో సమీక్షలు నిర్వహించారు.

**కేంద్రమంత్రి బండి సంజయ్‌కి కేటీఆర్ కౌంటర్**

కరీంనగర్ జిల్లాలో కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన దొంగనోట్ల ఆరోపణలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. కేంద్రమంత్రిగా ఉన్న బండి సంజయ్ తాము దొంగనోట్లను ముద్రించారని ఆరోపించడం విచిత్రమని వ్యాఖ్యానించారు. బండి సంజయ్ ఆరోపణలపై స్పందించిన కేటీఆర్, 'మీరు కేంద్రమంత్రిగా ఉండి మమ్మల్ని దొంగలు అంటారు. అయితే, అప్పుడు కర్ణాటకలో మీరే అధికారంలో ఉన్నారు కదా? దర్యాప్తు చేసి నిజాలు బయటపెట్టాల్సింది మీరే!' అని వ్యాఖ్యానించారు. నిరాధార ఆరోపణలు చేయడం బీజేపీ నేతలకు అలవాటైపోయిందని ఆరోపించారు.




దేశంలో జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ (డీలిమిటేషన్) చేపట్టకూడదన్నదే తమ పార్టీ యొక్క స్పష్టమైన డిమాండని కేటీఆర్ తెలిపారు. 'దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోంది. అందుకే, ఈ సమస్యను చర్చించేందుకు దక్షిణాది రాష్ట్రాల సదస్సుకు హాజరయ్యాం.' అని వివరించారు. బీజేపీ అసలు ముసుగును తొలగించేందుకు, దక్షిణాది రాష్ట్రాలను ఏకతాటిపైకి తేవాలని తమ పార్టీ ప్రయత్నిస్తోందని కేటీఆర్ పేర్కొన్నారు. 'పార్లమెంట్ కొత్త భవనంలో అన్ని సీట్లను లెక్క ప్రకారం ఏర్పాటు చేశారు. కానీ, అసలు సమస్య ఏమిటంటే, బీజేపీ ఉత్తరాదిలో, ముఖ్యంగా అస్సాం, జమ్ముకాశ్మీర్‌లో సీట్లు పెంచుతూనే ఉంది. అయితే, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ఎందుకు పెంచడం లేదు?' అని ప్రశ్నించారు. దక్షిణాది రాష్ట్రాల హక్కుల పరిరక్షణ కోసం పోరాడటం రాజకీయాలకతీతంగా చూడాలని కేటీఆర్ పేర్కొన్నారు. 'ఇక్కడ కాంగ్రెస్, బీఆర్ఎస్ అనే విషయమే కాదు. ముందుగా మనం భారతీయులం. దక్షిణాదికి జరుగుతున్న అన్యాయాన్ని తిప్పికొట్టాల్సిన అవసరం ఉంది.' అని ఆయన స్పష్టం చేశారు.

**కేటీఆర్ పర్యటనలో అపశృతి**

కరీంనగర్ పర్యటనలో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాన్వాయ్‌లో ఆదివారం అపశృతి చోటుచేసుకుంది. విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ పద్మజను పార్టీ కార్యకర్త శ్రీకాంత్ బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె కాలు విరిగింది. వెంటనే పార్టీ శ్రేణులు ఆమెను స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కేటీఆర్, ఆసుపత్రి అధికారులను సంప్రదించి, ఆమెకు అత్యవసర వైద్యసేవలు అందించాలని సూచించారు.

# బార్లపై మామూళ్ల వార్!

జగిత్యాల ప్రతినిధి, మార్చి 23 (మన బలగం): జగిత్యాల జిల్లాలోని బార్ ఆండ్ రెస్టారెంట్ నిర్వాహకులకు కొత్త చిక్కొచ్చిపడింది. ఇదివరకు ఆహార కల్తీ నిరోధక శాఖకు మామూళ్లు ఇచ్చిన దాఖలాలు లేకపోగా కొత్తగా మామూళ్లు ఇవ్వాలంటూ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆఫీస్ నుంచి భార్ల నిర్వాహకులకు అనధికార ఆదేశాలు అందినట్లు తెలిసింది. ఒక్కో బార్ నిర్వాకుడు ప్రతి ఏడాదికి రూ.12 వేలు ఇవ్వాలని, లేకుంటే తనిఖీలను నిర్వహించి కేసులు, జరిమానాలను ఫేస్ చేయాలని పరోక్షంగా హెచ్చరించినట్లు తెలిసింది. ఇప్పటికే బెల్టు షాపుల దెబ్బలకు బార్ ఆండ్ రెస్టారెంట్‌లకు వచ్చే కస్టమర్ల సంఖ్య తగ్గిపోతుండడం తెలిసిందే. వస్తున్న నష్టాలను ఎలా భర్తీ చేసుకోవాలా అన్న సందేహంలో ఉన్న బార్ ఆండ్



రెస్టారెంట్ల నిర్వాహకులకు మామూళ్ళ ముచ్చటలో పట్టమంటే కప్పకు కోపం విడవమంటే పాముకు కోపం అన్న చందంగా మారిందని కొందరు బార్ల నిర్వాహకులు అంటున్నారు. జగిత్యాల జిల్లాలో దాదాపుగా 20 వరకు బార్ ఆండ్ రెస్టారెంట్‌లు ఉన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఒక్కో బార్ నిర్వాహకుడి నుంచి 12 వేల లెక్కన వసూళ్లకు దిగితే ఒక్క బార్ల నుంచే ఏటా దాదాపుగా రెండున్నర లక్షల చేరుతాయన్నట్లు చర్చించుకొంటున్నారు. ఇలా కొత్తగా బార్ల నిర్వాహకులకు మామూళ్ళ బరువు పడితే మరో రకంగా ఆయా భార్లకు వెళ్లే మందు బాబుల జేబులకు చిల్లేనన్నట్లు చర్చించుకొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదాయ వనరుల కోసం బార్ ఆండ్ రెస్టారెంట్ల కు ప్రభుత్వం అనుమతులు ఇచ్చి వచ్చే ఆదాయం తో ప్రజా సంక్షేమాని వినియోగిస్తుంటే అదే ప్రభుత్వం విభాగాల్లో పనిచేసే ఉద్యోగులు ప్రజా ప్రయోజనాలను మరచి స్వంత లాభాలకు పోవడం సరికాదని పలువురు అంటున్నారు. ఇప్పటికే పలు విభాగాల నుంచి భార్ల నిర్వాహకులకు మామూళ్ళ బెడద ఉండగా కొత్తగా ఆహార కల్తీ నిరోధక శాఖ రూపంలో బార్లపై వార్ తప్పదేమో.

# ప్రజా సమస్యలపై అనునిత్యం పోరాడే ఏకైక పార్టీ సిపిఐ

కరీంనగర్, మార్చి 23 (మన బలగం): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అనునిత్యం పోరాడే పార్టీ సిపిఐ అని కసిరెడ్డి సురేందర్ రెడ్డి పేర్కొన్నారు. సిపిఐ మారుతీ నగర్ శాఖ సమావేశం గామినేని సత్తయ్య అధ్యక్షతన హౌసింగ్ బోర్డ్ చౌరస్తాలో జరిగింది. చౌరస్తాలో ఏర్పాటుచేసిన సిపిఐ పతాకాన్ని సురేందర్ రెడ్డి ఎగరవేశారు. ఈ సందర్భంగా కసిరెడ్డి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ సిపిఐ పార్టీ ఆవిర్భవించి వందేళ్లు గడిచిందని గత వందేళ్లుగా పార్టీ అనేక ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేసి ప్రజా సమస్యల పరిష్కారం కి కృషి చేసిందని ఆయన తెలిపారు. కరీంనగర్ నగరంలో ఉన్న అనేక సమస్యలపై సమరశీల పోరాటాలు చేసిన పార్టీ సిపిఐ అని నగరంలో వేలాది మందికి ఇండ్లు లేని నిరుపేదలకు ఇల్లు ఇచ్చిన పార్టీ అని రేషన్ కార్డులు, వృద్ధాప్య, వితంతు, వికలాంగ పెన్షన్ల కోసం అనేక పోరాటాల్లో ప్రజలను భాగస్వామ్యం చేసి పెన్షన్లను సాధించిన ఘనత సిపిఐకే దక్కుతుందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం



కరీంనగర్ నగరంలో స్మార్ట్ సిటీ పేర కోట్ల రూపాయల అవినీతికి పాల్పడిందని గత ప్రభుత్వ హయంలో జరిగిన అవినీతి పై సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. మారుతీ నగర్లో డ్రైనేజీ సమస్య ఉందని ఎప్పుడు పాతకాలపు డ్రైనేజీలు ఉండడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. సిపిఐ నగర సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు మాట్లాడుతూ మారుతి నగర్, హౌసింగ్ బోర్డ్ ప్రాంతంలో డంపు యార్డ్ నుండి వచ్చే గాలి వల్ల ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలతో గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత మున్సిపల్ పాలకవర్గం, బిఆర్ఎస్ ప్రభుత్వంలో నగరంలోని ప్రజలకు 24 గంటల నల్లా నీరు ఇస్తామని మాయ మాటలు చెప్పారని నేటికీ 24 గంటల నల్లా నీరు సౌకర్యాన్ని కల్పించకపోవడం గత పాలకుల చిత్తశుద్ధి అర్థమవుతుందన్నారు. గత పాలకవర్గ హయాంలో జంక్షన్ల ఆధునీకరణ పేరా కోట్ల రూపాయలు పందికొక్కుల తిన్నారని దీనిపై విచారణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గత మేయర్ స్మార్ట్ సిటీ అభివృద్ధి పనుల పేరా జరిపిన అవినీతి అక్రమాలపై కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి అక్రమ ఆస్తులను లాక్కోవాలని అన్నారు. ఈ శాఖ సమావేశంలో తోట కృష్ణయ్య, నాంపల్లి శంకర్, శ్రీనివాస్,నగునూరి రమేష్,మొహమ్మద్ ఆరిఫ్, కొట్టే రమేష్, కే రవి తోటస్వామి,డి రాజు,నానవేణి రాజు, తిరుమల స్వామి, నరసయ్య,రమేష్, కలీం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

MANA BALAGAM
మన బలగం
సామాన్యుడి ఆయుధం
తెలుగు దినపత్రిక

## బీఆర్ఎస్ అధినాయకుడికి బీదర్ లో దొంగనోట్లు ముద్రించే ప్రింటింగ్ ప్రెస్

### గత ఎన్నికల్లో దొంగనోట్లు పంచారు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



హైదరాబాద్, మార్చి 23 : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను తీవ్రంగా విమర్శించారు. ఆదివారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు బీదర్‌లో దొంగనోట్ల ముద్రణ ప్రెస్ ఉందని సంచలన ఆరోపణలు చేశారు. అక్కడ ముద్రించిన నకిలీ నోట్లే ఎన్నికల సమయంలో పంపిణీ చేసినట్లు ఆరోపించారు. తెలంగాణ బీఆర్ఎస్ పాలనలో తీవ్రంగా అప్పులపాలైందని, ప్రస్తుతం రాష్ట్రంపై రూ.6 లక్షల కోట్లకు పైగా అప్పు ఉందని ప్రభుత్వమే అంగీకరిస్తోందని తెలిపారు. ప్రభుత్వ భూములు అమ్మకుండా ఉద్యోగులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని, కమీషన్ల వ్యవస్థ మరింత పెరిగి 15 నుంచి 18 శాతానికి చేరిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఉద్యోగులకు అనేక హామీలు ఇచ్చిందని, కానీ ఆ హామీలను అమలు చేయడానికి కనీసం రూ.8 వేల కోట్లకు పైగా నిధులు అవసరమని విమర్శించారు. కాంగ్రెస్ విధానాలను చూస్తే మరికొన్ని నెలల్లో ఉద్యోగులకు జీతాల కోసం కూడా తీవ్ర సంక్షోభం ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించారు. రైతులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకపోతే ప్రభుత్వానికి గట్టి ప్రతిస్పందన ఎదురవుతుందని బండి సంజయ్ హెచ్చరించారు. రైతుల కష్టాలను పట్టించుకోని ప్రభుత్వం బాగుపడదని, రైతులు నిశ్చయిస్తే ప్రభుత్వాలే మార్చగలరని అన్నారు. నరేంద్రమోడీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎఫ్‌పీవో వ్యవస్థను మరింత బలోపేతం చేయడం అవసరమని ఆయన తెలిపారు.

## మైనారిటీలను చెడుగా చూపించేలా బీజేపీ వ్యూహం

ఢిల్లీ, మార్చి23: బీజేపీ ప్రభుత్వం తీసుకురాబోతున్న 'వక్ఫ్ బిల్లు'పై కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది సామాజిక సామరస్యాన్ని దెబ్బతీస్తుందని, మైనారిటీలను చెడుగా చూపిస్తుందని బీజేపీపై విమర్శలు చేశారు. ముస్లింలు వారి మతపరమైన సంప్రదాయాలను నిర్వహించే హక్కుని కోల్పోవడంతో పాటు వక్ఫ్ పరిపాలనను బలహీన పరచడం వంటి లోపాలు బిల్లులో ఉన్నాయని ఆరోపించారు. తప్పుడు ప్రచారం చేసి, మైనారిటీలను చెడుగా చూపించడమే బీజేపీ వ్యూహమని అన్నారు. వక్ఫ్ బిల్లు రాజ్యాంగంపై దాడిగా అభివర్ణించారు. 'వక్ఫ్ సవరణ బిల్లు-2024 అనేది బీజేపీ వ్యూహంలో భాగం. మన ప్రత్యేకమైన బహుళ మత సమాజంలో శతాబ్దాల నాటి సామాజిక సామరస్య బంధాలను దెబ్బతీసేందుకు నిరంతరం ప్రయత్నం చేస్తోంది. తప్పుడు ప్రచారాన్ని వ్యాప్తి చేస్తోంది. పక్షపాతాలను సృష్టిస్తోంది. తద్వారా వారిని చెడుగా చూపించడం, మతంతో సంబంధం లేకుండా పౌరుల సమాన హక్కులను, రక్షణ హామీలను ఇచ్చే రాజ్యాంగాన్ని నీరుగార్చడం' అని అన్నారు. ఎన్నికల్లో లాభాల కోసం మన సమాజాన్ని, మైనారిటీ వర్గాల సంప్రదాయాలను, సంస్థల్ని కించపరిచడం బీజేపీ వ్యూహమని అన్నారు. 'వక్ఫ్‌లను నిర్వహించడానికి మునుపటి చట్టాల ద్వారా సృష్టించబడిన అన్ని సంస్థల (జాతీయ మండలి, రాష్ట్ర బోర్డులు, ట్రిబ్యునళ్లు) అధికారాలు కోల్పోయేలా, ఉద్దేశపూర్వకంగా సమాజం తన స్వంత మత సంప్రదాయాలు, వ్యవహారాలను నిర్వహించుకునే హక్కును కోల్పోయేలా చురుకుగా ప్రయత్నిస్తున్నాయి' అని జైరాం రమేష్ అన్నారు. వక్ఫ్ భూముల్ని ఆక్రమించిన వారిని రక్షించడానికి ఇప్పుడు చట్టంలో రక్షణలు ప్రవేశపెడుతున్నారని ఆరోపించారు. 'వక్ఫ్ ఆస్తులకు సంబంధించిన వివాదాలకు సంబంధించిన విషయాలపై కలెక్టర్, ఇతర నియమించబడిన రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు వాటి రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన విస్తృత అధికారాలు ఇవ్వబడ్డాయి. తుది నిర్ణయం తీసుకునే వరకు ఎవరి ఫిర్యాదు పైనా లేదా వక్ఫ్ ఆస్తి ప్రభుత్వ ఆస్తి అనే కేవలం ఆరోపణపైనా రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు ఇప్పుడు ఏదైనా వక్ఫ్ గుర్తింపును రద్దు చేసే అధికారాలను కలిగి ఉంటారు' అని ఆరోపించారు.

# ఏప్రిల్ నుంచి సన్న బియ్యం

మొదటి పేజీ తరువాయి

తెలంగాణలో 84% మందికి సన్న బియ్యం అందించనున్నామని, ఇది మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలలో ఒకటి, ప్రజల కడుపు నింపే ప్రణాళికను కార్యరూపం దిద్దుతున్నామని ఆయన తెలిపారు. సివిల్ సప్లై శాఖ మంత్రిగా ఇది నాకు గర్వకారణమని ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. మాజీ ప్రభుత్వం కాలంలో తెలంగాణకు రావాల్సిన వాటా పూర్తిగా రాబట్టలేకపోయారని విమర్శించారు. 'కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయం చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. కానీ, కొత్త ప్రభుత్వం ఈ విషయంలో రాజీపడదు' అని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ పాలనలో ఉమ్మడి నల్లగొండ జిల్లా అన్ని రంగాల్లో వెనుకబడి



పోయిందని ఆరోపించారు. 'బీఆర్ఎస్ ప్రభుత్వ 10 ఏళ్ల పరిపాలనలో నల్లగొండ జిల్లా తీవ్రంగా నష్టపోయింది. అభివృద్ధి కంటే రాజకీయ ప్రయోజనాలే వారికెక్కువ. ఏపీ జలదోపిడీని ఇరిగేషన్ శాఖ మంత్రిగా ఉత్తమ్ కుమార్ రెడ్డి సమర్థంగా అడ్డుకున్నారు. 10 ఏళ్లు మంత్రిగా పనిచేసిన జగదీశ్ రెడ్డికి ఎస్ఎల్‌బీసీ ఎక్కడ ఉందో తెలుసా?' అని ఆయన అన్నారు.

బీఆర్ఎస్ పార్టీకి ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలు మొహం చూపించబోరని వెంకట రెడ్డి తేల్చి చెప్పారు. 'స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ రికార్డు స్థాయిలో మెజారిటీతో గెలుస్తుంది.' అని ధీమా వ్యక్తం చేశారు. ఎస్ఎల్బీసీ ప్రాజెక్టు అభివృద్ధిపై గత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని విమర్శిస్తూ, 'నేను, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కలిసి ఎస్ఎల్బీసీ ప్రాజెక్ట్ పూర్తి చేయాలని గత ప్రభుత్వాన్ని వేడుకున్నా, కానీ బీఆర్ఎస్ కనికరించలేదు.' అని పేర్కొన్నారు. ఎస్ఎల్బీసీ సొరంగ మార్గంలో జరిగిన ప్రమాదంపై విచారం వ్యక్తం చేస్తూ, 'ఈ ప్రమాదం మాకు చాలా బాధను కలిగించింది. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.' అని అన్నారు.

# అవినీతి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

మల్యాల, మార్చి 23 (మన బలగం): దేశంలో ప్రతి పౌరుడు తమ హక్కులు, బాధ్యతలు తెలుసుకొని అవినీతి రహిత సమాజం కోసం కృషి చేయాలని జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్ఆర్‌సి) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా స్థాయి సమావేశం జిల్లా అధ్యక్షులు కాసారపు శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టులో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు న్యాయవాది సుంకనపల్లి రాము, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు ఇమ్మడి ప్రణయ్, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు వడ్డిక అనిల్ రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మీడియా కన్వీనర్ రాచర్ల వేణు తదితరులు హాజరయ్యారు. ఈ సమావేశంలో భద్రయ్య మాట్లాడుతూ రోజురోజుకూ అవినీతి రాజ్యమేలుతోందని, దేశ సంపద అవినీతి, అక్రమార్కుల చేతిలో దుర్వినియోగం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బలమైన ప్రజా పోరాటాల ద్వారానే దేశాన్ని అవినీతిపరుల నుంచి కాపాడుకోగలమని అన్నారు. అవినీతి, అక్రమార్కులను సమాజంలో దోషులుగా చూపించే కార్యచరణను జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్ఆర్‌సి) రూపొందించిందని ఆయన పేర్కొన్నారు. అవినీతి రహిత సమాజం కోసం తమ సంస్థ చేస్తున్న కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు, న్యాయవాది సుంకనపల్లి రాము మాట్లాడుతూ మానవ హక్కుల ఉల్లంఘనపై స్పందించడమే కాకుండా మంచిని పెంచడం మానవత్వాన్ని పంచడం వంటి కార్యక్రమాలతో పాటు భారత రాజ్యాంగ చట్టాలను అనుసరించి పెన్ను, పేపర్‌ను ఉపయోగించి దేశంలో మార్పు, చైతన్యం కోసం కృషి చేస్తున్నామని అన్నారు. ఈ ప్రయత్నంలో 14 రాష్ట్ర కమిటీలు మన రాష్ట్రంలో 33 జిల్లా కమిటీల నిర్మాణం పూర్తి చేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్ధన్ రెడ్డి, జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి చేకూట శేఖర్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు నేరెళ్ళ శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి కోల రాజేశం గౌడ్, జిల్లా సంయుక్త కార్యదర్శి గణేష్, జగిత్యాల పట్టణ అధ్యక్షులు గుగ్గిళ్ళ సత్యనారాయణ, వంశీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లాలోని పలు మండల కమిటీల ప్రతినిధులకు నియమక పత్రాలు అందించారు. గొల్లపల్లి మండల కమిటీ అధ్యక్షులుగా దేవరకొండ శ్యాంసుందర్, ప్రధాన కార్యదర్శిగా ఎండి నజీర్ పాషా సంయుక్త కార్యదర్శిగా సిరికొండ గణేష్, వెలగటూరు మండల అధ్యక్షులుగా ధర్మాజీ ప్రమోద్, జగిత్యాల రూరల్ మండల అధ్యక్షులుగా పాలకుర్తి రంజిత్, ప్రధాన కార్యదర్శిగా ముద్దసాని అజయ్, మల్యాల మండల అధ్యక్షులుగా సామల లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఆడెపు భరత్ కుమార్, సారంగాపూర్ మండల కమిటీ అధ్యక్షులుగా న్యారబోయిన వంశీ, ఉపాధ్యక్షులుగా తుపాకుల జితేందర్, ప్రధాన కార్యదర్శిగా రాసమల్ల రాకేష్, సంయుక్త కార్యదర్శిగా నలువాల సుమన్, కోరుట్ల మండల అధ్యక్షులుగా మిట్టపల్లి గణేష్, కోరుట్ల పట్టణ అధ్యక్షులుగా ఆదిపెల్లి మహేష్ గౌడ్, కథలాపూర్ మండల కమిటీ అధ్యక్షులుగా గండి రాజేశం, ఉపాధ్యక్షులుగా మల్యాల ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా బుర్ర మనోజ్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా మర్రిపెల్లి గణేష్, తదితరులకు నియామక పత్రాలు అందించి సంస్థ విధివిధానాలకు అనుగుణంగా కృషి చేయాలని పేద ప్రజల పక్షాన నిలబడాలని సూచించారు.

# రాజకీయ ఏకీకరణపై కొనసాగుతున్న వివాదం

### దక్షిణాది రాష్ట్రాల హక్కులపై బీజేపీ మౌనం ఎందుకు?

### హైదరాబాద్ లో బహిరంగ సభ

### రాబోయే రాజకీయ మార్పులకు శ్రీకారం?

### డీలిమిటేషన్ అంశంపై కేకే కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, మార్చి 23 : తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు డీలిమిటేషన్ అంశంపై కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలో పొలిటికల్ యూనిటీ (రాజకీయ ఏకీకరణ) గురించి అనేక ప్రయత్నాలు జరిగినప్పటికీ, ఇప్పటికీ వివాదం కొనసాగుతూనే ఉందని ఆయన పేర్కొన్నారు. చెన్నైలో ఇటీవల జరిగిన దక్షిణాది రాష్ట్రాల సమావేశం గురించి మాట్లాడుతూ, ఈ మీటింగ్‌కు తెలంగాణ



ప్రభుత్వం పూర్తి మద్దతు ప్రకటించిందన్నారు.

కే. కేశవరావు మాట్లాడుతూ, డీలిమిటేషన్ అనేది కేవలం పార్లమెంట్‌లో సీట్ల పెంపు గురించి కాదని, ప్రతి రాష్ట్రానికి బలమైన ప్రతినిధిత్వం ఉండాలని కోరే ప్రక్రియ అని వివరించారు. ప్రతి జనాభా గణన తర్వాత ఇదే వివాదం మళ్లీ మళ్లీ తెరపైకి వస్తుందని గుర్తు చేశారు. ప్రధానంగా ఫెడరలిజం నశిస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 'మోడీ – అమిత్ షా ఫెడరలిజాన్ని పూర్తిగా మర్చిపోయారు. సెంట్రల్ లిస్ట్‌ను పెద్దది చేశారు, స్టేట్ లిస్ట్‌ను తగ్గించారు. ఫలితంగా, రాష్ట్రాల హక్కులు పోతున్నాయి' అని కేశవరావు వ్యాఖ్యానించారు.

డీలిమిటేషన్ అంశంపై బీజేపీ మౌనంగా ఉంటోందని, ఉత్తరాది రాష్ట్రాల్లో అస్సాం, జమ్మూకాశ్మీర్ వంటి ప్రాంతాల్లో సీట్ల సంఖ్య పెంచే ప్రయత్నం చేస్తూనే, దక్షిణాదిలో మాత్రం విస్మరించడం దారుణమని అన్నారు. తెలంగాణకు సీట్ల పెంపుపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. 'సీట్లు పెంచండి అని అడగడం వల్ల రాష్ట్రాల హక్కులు దక్కుతాయి. కానీ అమిత్ షా తన స్థాయికి తగ్గట్టుగా మాట్లాడడం లేదు. అలాంటి మైండ్‌సెట్‌తో సమస్యల పరిష్కారం కాదు' అని కేశవరావు విమర్శించారు.

కేశవరావు ఇందిరా గాంధీ హయాంలో ఇలాంటి సమస్యలే ఎదురయ్యాయని గుర్తు చేశారు. అయితే, డీలిమిటేషన్ వ్యవహారంలో ప్రస్తుతం కథానాయకుడు స్టాలిన్ అయినా, హీరో మాత్రం రేవంత్ రెడ్డేనని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'హైదరాబాద్‌లో బహిరంగ సభ పెడతామని ప్రకటించడం దక్షిణాది రాష్ట్రాల కోసం కీలక పరిణామం. ఇది రాబోయే రాజకీయ అజెండాను మలుపుతిప్పే అవకాశం ఉంది' అని కేశవరావు అభిప్రాయపడ్డారు.